క్లుప్తంగా

సీఎం దృష్టికి ఎన్టీపీసీ కాలుష్య సమస్య



జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: విశాఖ పర్యటనకు బుధవారం వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డిని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజ కవర్గానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానం గా పరవాడ మండలంలోని ఎన్టీపీసీ కాలుష్య నియంత్రణపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించాలని కోరారు. ఈ అంశంపై సీఎం స్పందించి కమిటీ నియమించాలని అధి కారులను ఆదేశించినట్టు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తెలిపారు.

సాదర స్వాగతం



విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ మర్యాద పూర్వకంగా కలిశారు. -పరవాడ

ప్రైవేటులో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

పరవాడ: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఎం. సునీత చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం ప్రవేశాలు ఉచితంగా కల్పించాలని విద్యాశాఖ నిబంధన విధించిందని చెప్పారు. మొదటి దశలో అనేక మంది విద్యార్థులు వారికి అనువైన పాఠశాలలను ఎంపిక చేసుకు న్నారని చెప్పారు. రెండో దశ ప్రవేశాల ప్రక్రి యకు ఈ నెల 6 నుంచి 15 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని కోరారు. గ్రామ వార్డు సచివాలయాల డేటా ఆధారంగా విద్యార్థుల అర్హత పరిశీలించి మే 22న లాటరీ పద్ధతిలో ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 24 నుంచి 28 వరకు ప్రవేశాలు పొందవచ్చునని ఎంఈవో సునీత తెలిపారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకుడు శేషబాబు

పరవాడ: ఎస్ఎంయూఎస్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీ యూసీ 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. యూని యన్ కార్యాలయం వద్ద యూనియన్ నాయకుడు వీవీ శేషబాబు ఐఎన్‌టీయూసీ జెం డాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివం గత పి.మధుబాబు, ఎల్.సంతోష్‌కుమార్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘననివాళులర్పిం చారు. అనంతరం కొండకర్ల అనాథ చిన్నా రులకు మధ్యాహ్న భోజనం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.వి.శే షబాబు, తుమ్మిరెడ్డి, జనరల్ సెక్రటరీ బి.భీమ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజేపీ లెనిన్, కార్య వర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించ నున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొన వచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇం డియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ,ఖాతా నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. వారి పేరిట అర్చకులు పూజలు చేస్తారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక

35 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



అనారోగ్యంతో బాధపడుతున్న లంద కృష్ణను పరామర్శిస్తున్న స్నేహితులు



సింహగిరిపై కలిసిన 1987-88 బ్యాచ్ సంస్కృతోన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులు

సింహాచలం: వారంతా వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల 1987-88 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు. పలు రంగాల్లో స్థిరపడ్డారు. దైవసన్నిధిలో తమ బ్యాచ్ విద్యార్థులంతా కలవాలని భావించారు. ఈమేరకు ఎక్కడెక్కడో ఉన్న స్నేహితులందరికీ సమాచారం అందించారు. విద్యనభ్యసించిన పాఠశాల ఉన్న స్వామివారి పాదాల చెంతనే కలవాలని నిర్ణయిం చారు. దీంతో సింహగిరిపై బుధవారం వారంతా కలుసుకున్నారు. 35 ఏళ్ల తర్వాత కలవడంతో ఆనందడోలికల్లో మునిగితేలారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో పాఠశాలలో చేసిన అలర్లు, సందడిని గుర్తు చేసుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. సింహాచలంలోనే ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్న తమ బ్యాచ్ విద్యార్థి లండ కృష్ణ ఇంటికి వెళ్లి అతనికి రూ.23 వేలు అందజేశారు. అతనికి ధైర్యం చెప్పారు. అపూర్వ కలయికకు ప్రణాళిక చేసిన విద్యార్థులు శిడగం బంగారు రాము, ఇజిరోతు వరలక్ష్మి, ప్రశాంతి, రామశాస్త్రి, పాలూరి నరసిం గరావు, ఎస్.శంకర్‌లకు సహచర విద్యార్థులంతా అభినందనలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని రాస్తారోకో



సినిమాహాలు కూడలిలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం, సీఐటీయూ కార్యకర్తలు

పరవాడ: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలను ఆపాలని సీపీఎం జిల్లా నాయకుడు వి.వి.రమణ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరస నగా సీపీఎం, సీఐటీయూ నాయకులు పరవాడ సిని మాహాలు కూడలిలో బుధవారం రాస్తారోకో నిర్వ హించారు. నాయకులు రమణ మాట్లాడుతూ ఉద్య మంలో పాల్గొన్న నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. విశాఖకు ఊపిరిగా భావించిన స్టీల్‌ప్లాంటును మోదీ ప్రభుత్వం ధ్వంసం చేయడమే కాకుండా బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూసివేసిందన్నారు. వర్కింగ్ క్యాపిటల్, సొంత గనులు ఇవ్వకుండా కావాలని ప్లాంట్‌ను నష్టాల ఊబిలోకి నెడుతుందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల లక్షలాది మంది ఉపాధి కోల్పోయే అవకాశం ఉంద న్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని నాయకులు రమణ, గనిశెట్టి విజ్ఞప్తి చేశారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



సబ్బవరం నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చెత్త తరలిస్తున్న లారీలు

సబ్బవరం: స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వ హణకు ప్రాధాన్యమిస్తోందని సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు అన్నారు. దీనిలో భాగంగా సబ్బవరం మేజర్ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు ఇంటిం టికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారని తెలిపారు. ఆ చెత్తను సబ్బవరంలోని చెత్త సంపద కేంద్రానికి తరలించి తడి,పొడి చెత్తగా విభజిస్తున్నట్టు చెప్పారు. దీనిలో భాగంగా సేకరించిన సుమారు 5 లారీల చెత్తను బుధవారం సబ్బవరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నుంచి కాపులుప్పాడలోని డంపిం గ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో పం చాయతీ కార్యదర్శి కార్యమూర్తి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కవులకు పరిశీలన అవసరం



సుబ్రహ్మణ్యం, రామతాతలను సత్కరిస్తున్న సాహితీవేత్తలు


సీతంపేట: కవిత్వం రాసే నవకవులంతా ప్రముఖ కవులు, రచయితల రచనలు చదవడం, పరిశీలిం చడం అలవాటు చేసుకోవాలని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ సూచిం చారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం ప్రిజం కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. నవకవుల మార్గదర్శి శ్రీశ్రీ అని, కవి మనిషి రుణం తీర్చుకునేందుకు సమాజ చైతన్యం కోసం పద్యాలు అల్లుతాడని, ప్రజల గొం తు వినిపిస్తాడని, చైతన్యమే నినాదమై నవీన యుగాన్ని ఆవిష్కరిస్తాడని తెలిపారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ఇటీవల దివంగతుడైన చిత్రకారుడు బాలి గొప్పతనాన్ని, కళా విశిష్టతను వివరించి నివాళులర్పించారు. ఇటీవల కళాసేవలో నంది పురస్కారం అందుకున్న జి.కె.సుబ్రహ్మణ్యం, హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సాహిత్య సంబా రాల్లో సత్కారం పొందిన రామతాతలను ఈ సంద ర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవే త్తలు చిన సూర్యనారాయణ, కవిత గమనం గమ్యం , రామతాత కవిత ధరాఘాతం, బి.రాధారాణి కబీర్ దాసు దోహాలు, కె.వి.ఎస్.మూర్తి కవిత భయం, కొత్తూరి రమణ ఊరగాయోపాఖ్యానం కవితలు చదివి వినిపించారు.

ఇసుకకొండకు ఆధ్యాత్మిక శోభ

- 5న సత్యదేవుని ఆలయంలో బుద్ధ పూర్ణిమ



రమా సహిత సత్యనారాయణ స్వామి



ఇసుకకొండపై వెలసిన స్వామి ఆలయం

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెల సిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆల యంలో ఈ నెల 5న బుద్ధ పూర్ణిమను పురస్కరిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ఆ రోజు వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు, సామూహిక, విశేష వ్రతాలు జరపనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో బుద్ధ మహలక్ష్మి నగేష్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుం డా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశామని, క్యూలై న్లలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

దేవాలయ చరిత్ర..

ఈ దేవాలయం సుమారు 200 సంవత్సరాల కిం దట సీతారామ్ బాబాజీ అనే సాధువు (సిద్ధ పురు షుడు) నిర్మించినట్టు పూర్వీకులు చెబుతారు. మహా రాష్ట్ర నుంచి పాలరాతి విగ్రహాలు తీసుకొచ్చి ప్రతిష్ట చేసి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి దేవా లయం నానాటికీ అభివృద్ధి చెందుతూ నిత్య దీప, ధూప, నైవేద్యాలతో విలసిల్లుతోంది. 1986లో అప్పటి దేవదాయ, ధర్మ దాయ శాఖ కమిషనర్ దేవాలయాన్ని దర్శిం చుకుని కనకమహాలక్ష్మి దేవాలయానికి దత్తత ఇచ్చి అభివృద్ధి చేస్తే దేవాలయం విశిష్టత మరింత పెరుగుందని భావించారు. అమ్మవారి దేవాలయా నికి దత్తత చేసి, ఆ నిధుల నుంచి సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి చేశారు. రాజ గోపురం, అనివెట్టి మండపం, విమాన గోపురం, వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఆగమ పండితుల సలహా మేరకు దక్షి ణాది ఆచారం ప్రకారం కృష్ణశిల విగ్రహాలు (నల్లరా తి) కూడా ప్రతిష్ఠించారు.

స్వామి వ్రతం..

ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు, పౌర్ణమిరోజు ఉదయం 5 నుంచి 11 గంటల వరకు నిరంతరా యంగా స్వామి సామూహిక వ్రతాలు నిర్వహి స్తున్నారు. పూజా రుసుం రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

ధ్వజస్తంభ పూజ, విశేష దర్శనం..

ధ్వజస్తంభ పూజ, విశేష దర్శనం చేయించుకోదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకో వాలి. పౌర్ణమి రోజున ప్రత్యేకంగా ధ్వజస్తంభ ప్రద క్షిణ ఉంటుంది.

ఆలయం తెరచు వేళలు..

ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు, పౌర్ణమి రోజు ఉదయం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా ఆలయం తెరిచే ఉంటుంది. మహానివేదన ఉదయం 11.40 నుంచి 12 గంటల వరకు.

వైభవంగా సూర్యభగవానుడి విగ్రహ ప్రతిష్ట

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సూర్యనారాయణస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. యువ హిందూ సాంస్కృతిక సంఘ్ ఆధ్వర్యంలో విశేష పూజలు, చప్పన్ బోగ్, హవాన్, మహాహారతి తదితర కార్యక్రమాలు నిర్వహిం చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు మార్పు చేయనున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏఈ డీవీఎల్.కుమార్ తెలిపారు. జీవీఎంసీ 98వవార్డు పరిధిలోని విజినిగి రిపాలెం, ఎంఎంటీసీ కాలనీ, పుష్కరిణిరోడ్డు, సిం హాచలం మధ్య వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా సామ్రాట్ కుమార్



సామ్రాట్ కుమార్‌ను అభినందిస్తున్న సభ్యులు

సబ్బవరం: అనకాపల్లి జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్‌గా మండలంలోని అమృత పురానికి చెందిన గొటివాడ సామ్రాట్ కుమార్ నియ మితులయ్యారు. ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాట్లా డుతూ అన్ని జిల్లాల్లో నూతన కమిటీల నియామకం జరుగుతుందన్నారు. సామ్రాట్ కుమార్ మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన సుబ్బారావు మాదిగతో పాటు కడిత సాధూరావుతో పాటు మిగిలిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆధీనంలో గల అన్ని గ్రంథాలయాల్లో ఈ నెల 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించను న్నారు. కథలు.. కథనాలు.. సృజనాత్మక కళలతో వేసవి విజ్ఞాన శిబిరాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా నగరంలోని 36వ వార్డు రంగిరీజువీధిలో గల బాలల శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8 నుం చి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వ హించనున్నారు. సమ్మర్ క్యాంపులో పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయి. గ్రంథాలయ పరిస రాల్లో గల విద్యార్థులు ఈ వేసవి శిబిరాన్ని విని యోగించుకోవాలని బాలల శాఖ గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి కోరారు.

కేజీహెచ్‌లో నర్సింగ్ క్లాక్ రూమ్ ప్రారంభం



నర్సింగ్ క్లాక్ రూమ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : కేజీహెచ్‌లో నర్సుల కోసం రూ.రెండు లక్షల 50 వేల వ్యయంతో పునర్నిర్మిం చిన క్లాక్ రూమ్‌ను బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసకుమార్, ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవరావు, డాక్టర్ జగదీష్ కుమార్, ఏఆర్ఎంవో అరుణాకుమారి, డీఈఈ మన్మథరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయ లక్ష్మి,పి.వరలక్ష్మి,డి.లక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.

7న అల్లూరి వర్ధంతి కార్యక్రమాలు



వివరాలు వెల్లడిస్తున్న రెక్టార్ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి కార్యక్రమాలు ఆంధ్ర విశ్వకళా పరిషత్, తెలుగు, సంగీత నృత్య శాఖల సంయుక్తంగా సమైక్య భారతి స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఈ నెల 7న నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఏయూ సంగీత విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెక్టార్ ఆచార్య కె.సమత ఈ మేరకు వివరాలు వెల్లడించారు. అల్లూరి తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక అని అన్నారు. అటువంటి మహ నీయుడిని స్మరించుకోవలసిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. బీచ్ రోడ్డులో 7వ తేదీ ఉదయం 10 గంటలకు గాంధీ పార్కు, దసపల్లా హిల్స్ వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు బీచ్ రోడ్డులో స్వాతంత్ర్య సమరయోధుల మైదానంలో సంగీత నృత్య శాఖల ఆధ్వ ర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. విజయ నిర్మాణ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎస్.విజయకుమార్, సంగీత నృత్య విభాగాధిపతి ఆచార్య ఎ.అనురాధ,ఆచార్య కె.సరస్వతి, బూసి వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: అప్పన్నపాలెంలో భూలోకమాంబ ఆలయ పునర్నిర్మాణానికి పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు. అప్పన్నపాలెం వాసుల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్న భూలోకమాంబ ఆలయం దశాబ్దాల కిందట నిర్మించారు. కాగా వేపగుంట నుంచి గోశాల వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ కారణంగా అమ్మవారి ఆలయం ప్రస్తుతం ఉన్న రోడ్డు కంటే దిగువన ఉండడంతో భక్తులు ఆలయా నికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామ పెద్దలు ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని తొలగిం చి పునర్నిర్మించాలని చేపట్టేందుకు నిర్ణయం తీసు కున్నారు. ఈమేరకు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శాస్త్రోక్తంగా కొబ్బరికాయకొట్టి శంకుస్థా పన చేశారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయ కులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి, అప్పన్నపాలెం గ్రామస్తులు నొళ్ల దేముడు, పల్లా వెంకటరావు, జగదీష్, పైడిరాజు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ నాగరాజు, గ్రామ స్తులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలను ప్రారంభించిన గ్రామీణ వికాస బ్యాంకు జీఎం సోమయాజులు

పరవాడ: గ్రామీణ బ్యాంకుల్లో మైక్రో ఏటీఎం ద్వారా పాస్ బుక్ ప్రింటింగ్ సేవలు అందుబాటు లోకి తీసుకువచ్చినట్టు గ్రామీణ వికాస బ్యాంకు జన రల్ మేనేజర్ శ్రీరామ సోమయాజులు చెప్పారు. తానాం గ్రామంలో సీహెచ్.కనకలక్ష్మి ఆధ్వర్యంలో నడుస్తున్న ఏపీజీవీ బ్యాంకు మిత్రలో ఈ ప్రింటర్ సదుపాయాన్ని ఆయన బుధవారం ప్రారంభిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు తమ పాస్ బుక్ ప్రింటింగ్‌ను ఉచితం గా పొందే అవకాశం కల్పించామన్నారు. పాస్ బుక్ ముద్రణ ప్రాముఖ్యతను వివరించారు. బ్యాంక్ ద్వారా 1300 ఆర్‌డీ అకౌంట్లు ప్రారంభించిన బ్యాం కు మిత్ర కనకలక్ష్మిని అభినందించారు. గ్రామీణ బ్యాంకు అభివృద్ధికి ప్రజలు సహకరించాలని సోమయాజులు కోరారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం సమంత కుమార్, గ్రామీణ వికాస బ్యాంకు బిజినెస్ మేనేజర్ భరణి కుమార్, నోడల్ అధికారి శివ కుమార్, ఐరిక్స్ టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధి కన కరాజు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణ ప్రతీ కార్మికుడి బాధ్యత



811వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: నిర్బంధాలు, అణచివేతలతో ఉక్కు ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరని ఉక్కు పరిర క్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మ న్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు 811వ రోజుకు చేరుకు న్నాయి. ఈ దీక్షలో పలు కార్మిక సంఘాల నేతలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. రాష్ట్రంలోని ప్రతి కార్మికుడు తన వంతు కర్తవ్యంగా ఉక్కు ఉద్యమాన్ని మరింత బలపరచవలసిన అవసరం ఆసన్నమైందన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలను కేంద్ర ప్రభుత్వం అప హాస్యం చేస్తోందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నామని అన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అరెస్టులపై ఆందోళన



స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళన చేస్తున్న పోరాట కమిటీ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. రాస్తారోకో చేస్తున్న 26 మంది నాయకులను అరెస్ట్ చేసి స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో, పోలీస్ స్టేషన్ వద్ద నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ అరెస్టులు ప్రజా వ్యతిరేక, దివాలాకోరు విధానాలకు నిదర్శన మన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, 78వ వార్డు కార్పొరేటర్ జి.గంగారావు, యు. రామస్వామి, కె.ఎం. శ్రీనివాస్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గ్రౌండ్స్‌లో డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు



వాకర్స్‌లో పార్క్‌లో పర్యటిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, రైల్వే అధికారులు

తాటిచెట్లపాలెం: రైల్వే గ్రౌండ్స్‌లోని వాకర్స్ పార్క్‌ను బుధవారం డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆక స్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పార్క్‌ను మరింత సుందరంగా తయారుచేసి నగరంలోనే ఒక మోడల్ పార్క్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పార్క్‌ను ప్రధానం గా నగర పౌరులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు వాకింగ్ కోసం వినియోగిస్తున్నారు. పూర్తిగా పచ్చదనంతో, కూర్చునేందుకు అనువైన సదుపాయాలతో ఈ పార్క్‌ను తయారుచేశారు. పర్యటనలో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ పారిజాత సత్పతి, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(హెడ్ క్వార్టర్స్) ఎస్.కె.సారంగి, సీనియర్ అధికారులు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్, స్పోర్ట్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వైదిక సదస్యం



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి



వైదిక సదస్యంలో పాల్గొన్న వేదపండితులు

- వెంకన్న సన్నిధిలో పండితుల వేద పఠనం

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీం ట్లో భాగంగా శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవం గా నిర్వహించారు. బుధవారం ఆలయ కల్యాణమం డపంలో వైదిక సదస్యం నిర్వహించారు. వేద పండి తులు గురునాథ్ శర్మ, శ్రీనివాసశర్మ, ఘనాపాఠీలు పాల్గొని నాలుగువేదాలు వల్లె వేశారు. వేద పఠనం తో బల్లిగిరి మార్మోగింది. వేంకటేశ్వరుని వైభవాన్ని పండిత శ్రేష్ఠులు వివరించారు. అనంతరం ఆలయ ఈవో జీవీ రమాబాయ్ పండితులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామివారికి బాల భోగం, హోమాలు, అర్చన, నివేదన, మంగళా శాసనములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.